

రామయ్యకు పుష్పయాగం

పిట్టలవానిపాలెం : స్థానిక సీతారామ స్వామికి జ్యేష్టాభిషేక పుష్పయాగం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. 108 కలశాలతో సుగంధ ద్రవ్యాలు, నదీ జలాలతో అభిషేకం గావించారు.



కాజలో కోలాహలంగా ఏరువాక

మంగళగిరి: కాజా గ్రామంలో శుక్రవారం సాయంత్రం ఏరువాక నిర్వహించారు. రైతులు పెద్ద సంఖ్యలో వినాయకుని ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ధనలక్ష్మిగా బగళాముఖి దర్శనం



పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలోని శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో శుక్రవారం హరిద్ర శృంగారార్చన అత్యంత వైభవంగా నిర్వహించారు. అమ్మవారు ధనలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

న్యూస్‌రీల్

బ్రిడ్జిపై మరమ్మతులు చేయండి



తెనాలిఅర్బన్: ఓవర్ బ్రిడ్జిపై ఉన్న ఫుట్‌పాత్ మరమ్మతు పనులను వెంటనే ప్రారంభించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. ఓవర్ బ్రిడ్జిని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఫుట్‌పాత్ దెబ్బతిని ఉండటాన్ని గమనించిన ఆయన తగిన ఆదేశాలు ఇచ్చారు. అనంతరం 31వ వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని సూచించారు. పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

యార్డులో 48,825 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 43,236 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 48,825 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.17,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ.20,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ.8,500 నుంచి రూ.18,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ.9,500 నుంచి రూ.20,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.12,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 12,490 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

కొండెక్కిన .. కొత్తిమీర ధర



సత్తెనపల్లి: కొత్తిమీర కొండెక్కి కూర్చుంది. రూ.10 ఉన్న 200 గ్రాముల కొత్తిమీర కట్ట ధర ఒక్కసారిగా పెరుగుతూ ప్రస్తుతం రూ.45కి చేరింది. దీంతో వ్యాపారులు రవాణా, తరుగు చార్జీలు కలుపుకొని కొంతమేర లాభంతో బహిరంగంగా మార్కెట్లో కొత్తిమీర కట్ట రూ.50 నుంచి 60 వరకు విక్రయిస్తున్నారు. ఈ పంట స్థానికంగా అందుబాటులో లేకపోవడం వల్ల హోల్‌సేల్ వ్యాపారులు పలమనేరు, కోలార్ నుంచి తిరుపతికి అక్కడ నుంచి ఓల్వా జిల్లాలోని వ్యాపారులు దిగుమతి చేసుకుంటున్నారు. కొత్తిమీర ధర ఈ ఏడాది జనవరిలో 200 గ్రాముల కట్ట రూ.10 నుంచి రూ.15 వరకు ఉంది. అప్పటి నుంచి వేసవికాలం ప్రారంభమయ్యే నాటికి కొత్తిమీర పంట పూర్తిగా తగ్గిపోవడంతో కొరత తీవ్రమైంది. దీనివల్ల హోల్‌సేల్ వ్యాపారులు కొత్తిమీరను తిరుపతి ప్రాంతం నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. దీనితోపాటు పుదీనా, గోంగూర, తోటకూర వంటి ఆకు కూరల ధరలు పెరగడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు.

దుర్గమ్మకు మలేషియా కళాబృందం నృత్యనీరాజనం




ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు మలేషియాకు చెందిన నందిగేశ్వర్ డ్యాన్స్ అకాడమీ కళాబృందం శుక్రవారం నృత్య నీరాజనాలను అర్పించారు. శుక్రవారం సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం కళావేదికపై చంద్రమోహన్ రామస్వామికి చెందిన పలువురు కీర్తనలకు కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించారు. అమ్మవారి దర్శనం అనంతరం కళావేదిక వద్దకు చేరుకున్న భక్తులు నృత్య ప్రదర్శనను ఆద్యంతం ఎంతో ఆసక్తిగా వీక్షించారు. అనంతరం కళాబృందానికి చెందిన వారికి ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి, ప్రసాదాలను అందజేశారు.

ఫీ'జులుం' కాలం

వర్షాలు పడి సీజనల్ వ్యాధుల కాలం మొదలైనట్లు.. పాఠశాలలు పునఃప్రారంభమై.. ప్రైవేట్ యాజమాన్యాల ఫీ'జులుం' కాలం ప్రస్తుతం నడుస్తోంది. షూ నుంచి టై వరకు, బలపం నుంచి పెన్ను వరకు.. స్కూల్లో అడుగు పెట్టినప్పటి నుంచి ఇంటి గంట కొట్టే వరకు ఫీజుల మోత మోగిస్తున్నాయి. ఒక్క విద్యే కాదు..అనేక వ్యాపారాలకు స్కూల్స్ కేంద్రంగా మారాయి. స్కూల్ ఫీజు, బుక్స్ ఫీజు, వ్యాను ఫీజు, ఎక్స్‌ట్రా యాక్టివిటీస్ పేరిట ఫీజులు చెల్లించి.. యూనిఫాం కూడా యాజమాన్యం చెప్పిన దుకాణాల్లోనే కొనుగోలు చేయాలి. దీంతో ఒక విద్యార్థిని చదివించాలంటే తల్లిదండ్రులకు ఆర్థిక భారం తడిచి మోపెడవుతోంది. విద్యా సంస్థల అక్రమ ఫీజుల వసూళ్లను, డొనేషన్లను అరికట్టడంలో అటు విద్యాశాఖ, ఇటు విద్యార్థి సంఘాలు ఎంత ప్రయత్నించినప్పటికీ విఫలమవుతూనే ఉన్నాయి. – బాపట్లటౌన్/చీరాల

జోరుగా ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్స్ అడ్మిషన్లు

- ఫీజుల వివరాలు నోటీసు బోర్డుల్లో కనిపించని వైనం
- తరగతుల వారీగా భారీగా పెంపు
- విద్యా సామగ్రి, యూనిఫాం, ఎక్స్‌ట్రా యాక్టివిటీస్ పేరుతో వసూళ్లు
- శిక్షణ పొందిన ఉపాధ్యాయులు, వసతులు కరువు
- ఎక్కడా అమలు కాని విద్యా హక్కు చట్టం
- పాఠశాలల అర్హతపై తల్లిదండ్రుల్లో కొరవడిన అవగాహన



బాపట్ల జిల్లాలో 326 కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలున్నాయి. వీటిల్లో ఎల్‌కేజీకి రూ.18వేలతో మొదలైన చదువు.. 8, 9, 10 తరగతులకు ఒక్కో విద్యార్థికి రూ.50వేల నుంచి రూ.70 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఓ మోస్తరు స్కూల్స్‌లో ఈ ఫీజుల్లో ఓ పది వేల రూపాయలకు అటు ఇటుగా హెచ్చు, తగ్గులున్నాయి. యాజమాన్యాలు తరగతుల వారీగా ఎంత ఫీజు తీసుకుంటున్నారో పాఠశాలల్లోని నోటీసు బోర్డుల్లో వివరాల పట్టిక అందుబాటులో ఉంచాలి. ఈ మేరకు విద్యాశాఖాధికారులు చెబుతున్నప్పటికీ ఏ పాఠశాలలో కూడా ఫీజుల చార్టులు కనిపించడం లేదు. పెగా యూనిఫాం, నోట్ బుక్స్, గైడ్లు, మా దగ్గరే కొనుగోలు చేయాలంటూ హుకుం జారీ చేస్తున్నాయి. ఒకటో తరగతికి రూ.4 వేలు మొదలు పదో తరగతికి రూ.12 వేల వరకు బుక్స్ పేరుతో ఫీజులు వసూలు చేస్తున్నారు. వీటితో పాటు లైబ్రరీ, సాంస్కృతిక కార్యక్రమాలు, వ్యాయామం, కంప్యూటర్ కోర్సులు, స్కూల్ బస్ చార్జీల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ముక్కు పిండి వసూలు చేస్తున్నారు.

నాణ్యమైన విద్య.. అధికారులకే ఎరుక..

కార్పొరేట్ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడంతో పాటు ఆటపాటలతో కూడిన విద్యనందించాలని విద్యాశాఖాధికారులు యాజమాన్యాలకు పదే పదే చెబుతున్నారు. ప్రత్యేక శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో బోధన అందించాలని స్పష్టం చేస్తున్నారు. కానీ, వాస్తవంలో.. ఒత్తిడితో కూడిన విద్యనందించడం మినహా ఆటపాటలకు కార్పొరేట్ పాఠశాలల్లో అస్కారం లేకుండా పోతోంది. ఫీజులు అధికం.. వసతులు శూన్యం అన్న చందంగా మారింది. ప్రత్యేక తరగతి గదులు.. ఆ గదుల్లో సీట్ల మేరకే విద్యార్థులకు బోధన జరుగుతుందని, అందుకు తగ్గట్లు వసతులు కల్పిస్తామని చెబుతూ.. యాజమాన్యాలు రూ.వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తూ పబ్బం గడుపుకుంటున్నాయే కానీ, విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయటం లేదని తల్లిదండ్రుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి.

తల్లిదండ్రులు తెలుసుకోవాల్సిన విషయాలు..

పిల్లలను ప్రైవేట్ పాఠశాలలో చేర్పించే ముందు తల్లిదండ్రులు ఆకర్షణీయ ప్రకటనలు చూసి మోసపోవద్దు. చేర్పించే పాఠశాలకు అసలు ప్రభుత్వ గుర్తింపు ఉందా..? లేదా..? అనేది తొలుత విచారించుకోవాలి. పాఠశాల భవనం నాణ్యతపై ప్రభుత్వ ధ్రువీకరణ పత్రాన్ని పరిశీలించాలి. జీ ప్లస్–1 భవనాలు ఉంటే అగ్నిమాపక పరికరాలు, ఏదైనా ప్రమాదం వాటిల్లితే తక్షణమే మంటలు ఆర్పే పూర్తి స్థాయి వ్యవస్థ ఉండాలి. మరుగుదొడ్లు, నీటి సదుపాయం, మౌలిక సదుపాయాలను తప్పనిసరిగా చూసుకోవాలి. ప్రాథమిక, ప్రాథమికోన్నత స్థాయిలో 20 నుంచి 40 మందికి ఒక ఉపాధ్యాయుడు ఉన్నారా.. లేరా.. తెలుసుకోవాలి. ఉన్నత పాఠశాలలో అయితే సబ్జెక్టుల వారీగా ఒకరు చొప్పున ఉపాధ్యాయులు ఉన్నారా, విద్యార్థుల మానసిక, శారీరకోల్లాసానికి ఉపకరించే క్రీడా ప్రాంగణం, అనుగుణంగా క్రీడా ఉపాధ్యాయులు ఉన్నారా అనే విషయాలపై ఆరా తీయాలి. అన్ని సబ్జెక్టులకు అర్హత కలిగిన ఉపాధ్యాయులతో బోధన ఉన్న పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలి.

నిబంధనలు ఇలా..

- విద్యా హక్కు చట్టంలో భాగంగా పేద విద్యార్థులకు ప్రతి ప్రైవేట్ పాఠశాలలో 25 శాతం సీట్లు కేటాయించాలి. కానీ, ఈ నిబంధనలు ఎక్కడా అమలు కావడం లేదు.
- యాజమాన్యాలు విద్యార్థులకు సరిపడా గదులు, వసతులు కల్పించాలి.
- పాఠశాల భవనాల నిర్మాణ నాణ్యత ధ్రువీకరణ పత్రం ఉండాలి.
- విద్యార్థుల మానసిక ఎదుగుదలకు ఆట స్థలం, లైబ్రరీ, ప్రహరీ, అగ్నిమాపక శాఖ జారీ చేసిన నో–అబ్జెక్షన్ సర్టిఫికెట్ పొందాలి.
- తాగునీటి వసతి, ప్రథమ చికిత్స సౌకర్యం, కంప్యూటర్ గది, మరుగు దొడ్లు ఖచ్చితంగా ఏర్పాటు చేయాలి.
- విద్యాహక్కు చట్టం ప్రకారం బీఎడ్, డీఎడ్ పూర్తి చేసిన ఉపాధ్యాయులతోనే బోధన చేయించాలి.
- పిల్లలు స్కూల్ బయట రోడ్డు దాటడానికి సౌకర్యం కల్పించాలి.
- ఫీజుల వివరాలు స్పష్టంగా పాఠశాల నోటీసు బోర్డులో అతికించాలి.
- ప్రభుత్వ పుస్తకాలతోనే బోధన సాగించాలి.
- ఒక గదిలో 40 మంది విద్యార్థులు దాటితే మరో సెక్షన్ కోసం అలాగే ప్రీ–ప్రైమరీ నిర్వహణకు అనుమతులు తీసుకోవాలి.

చట్టపరంగా చర్యలు తీసుకుంటాం



కార్పొరేట్ స్కూల్స్‌లో వసతులు, యూనిఫాం, పుస్తకాల పేరుతో అధిక వసూళ్లకు పాల్పడుతున్నారని ఇప్పటి వరకు విద్యార్థులు, తల్లిదండ్రులెవరూ మా దృష్టికి తీసుకురాలేదు. జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా ప్రవర్తించినా, అధిక ఫీజులు వసూలు చేసినా, సమయపాలన పాటించక పోయినా సదరు యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– కె.నారాయణరావు, డీఈఓ, బాపట్ల

పాఠశాలలో మూడు ఐఎఫ్‌పీల ధ్వంసం

ఒక్కోదాని ఖరీదు రూ.1.50 లక్షలు



పగిలిపోయిన ప్యానల్

వెల్లటూరు(భట్టిప్రోలు): మండలంలోని వెల్లటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మూడు ఐఎఫ్‌పీ (ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్)లను ధ్వంసం చేశారు. పాఠశాలల విద్యార్థులకు గత ప్రభుత్వం డిజిటల్ విద్యను బోధించేందుకు 11 ఐఎఫ్‌పీలను అందజేసింది. వీటి ఖరీదు ఒక్కోటి రూ.1.50 లక్షలు. శుక్రవారం ఉదయం పాఠశాల తెరిచే సమయానికి మూడు ప్యానల్స్ ధ్వంసం కావడాన్ని గమనించిన ప్రధానోపాధ్యాయిని కర్రా అరుణకుమారి ఎంఈఓలు పి.లాజర్, ఎస్.దేవరాజు, జిల్లా విద్యాశాఖాధికారులకు సమాచారం అందించారు. వారి సూచనల మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆమె ఫిర్యాదు చేశారు. ఎస్ఐ కాసుల శ్రీనివాసరావు పాఠశాలను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. కేసు నమోదు చేసి, విచారిస్తున్నారు. విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ప్యానల్స్‌ను ధ్వంసం చేయడంపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 504.40 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 814.70 అడుగుల వద్ద ఉంది. రోజా నుంచి శ్రీశైలం జలాశయానికి 899 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

కాల్వల ఆధునికీకరణపై దృష్టి సారించాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా

సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

బాపట్ల టౌన్: పంట కాల్వల ఆధునికీకరణపై అధికారులు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు రైతులు సమాయత్తమవుతున్నందున ముందుగానే పంట కాల్వల మరమ్మతులు చేపట్టాలన్నారు. జిల్లాలో ఏటా జూలైలో పంటల సాగు ప్రారంభమవుతుందని, ఇందుకనుగుణంగా రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు పంపిణీ చేసేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. రైతుల పొలాల్లో మట్టి నమూనాలు సేకరించి, పరీక్షలు చేయించాలని సూచించారు. ఈ ఖరీఫ్‌కు జిల్లాలో 1,41,916 ఎకరాల్లో పంటల సాగు చేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని చెప్పారు. ప్రస్తుతం 1,045 క్వింటాళ్ల పచ్చిరొట్ట ఎరువు విత్తనాలు మండలాల్లో సిద్ధంగా ఉంచామని తెలిపారు. జూన్‌లో సగటు వర్షపాతం నమోదైందని, వర్షాలు మొదలు కాగానే తదనుగుణంగా నీటి విడుదలకు ప్రణాళికలు రూపొందించాలని సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా పరిధిలోని పంట కాల్వలకు 154 మరమ్మతులకు ప్రణాళికలు రూపొందించి, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని కలెక్టర్ రంజిత్ బాషా వివరించారు. వీటికి సుమారుగా రూ.13.43 కోట్లు నిధులు అవసరమని ప్రభుత్వాన్ని కోరినట్లు ఆయన చెప్పారు. అధికారికంగా అనుమతులు రాగానే పనులు ప్రారంభించాలన్నారు. జల వనరులు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా క్షేత్ర పరిశీలన చేసినప్పుడే ఆయకట్టు భూములకు సాగునీటిని అందించగలమని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ అధికారి కె.శ్రీనివాసరావు, కృష్ణా పశ్చిమ డెల్టా ఎస్ఈ ఉమామహేశ్వరరావు, ఈఈ మల్లికార్జున, జల వనరుల శాఖ ఈఈ మురళీకృష్ణ, ఉద్యాన శాఖ ఏడీ జెన్నెమ్మ పాల్గొన్నారు.

దుగ్గిరాల.. గుండెలవిసేలా

- రామాపురం బీచ్‌లో నలుగురు గల్లంతు
- ఇద్దరి మృత దేహాలు లభ్యం
- మరో ఇద్దరి కోసం గాలింపు
- దుగ్గిరాలకు చెందిన యువకులుగా గుర్తింపు
- శోక సంద్రంలో బాధితుల కుటుంబాలు



జాలా కిషోర్ (ఫైల్)



గొటికల తేజ (ఫైల్)



నితిన్ (ఫైల్)



అమ్మన్న రాజ్ (ఫైల్)

పెదవేగి: సరదాగా సేద తీరేందుకు బీచ్‌కు వెళ్లిన నలుగురు యువకులు సముద్రంలో గల్లంతు కావడం తీరని విషాదాన్ని నింపింది. వీరిలో ఇద్దరు దుర్మరణం చెందగా, మరో ఇద్దరి ఆచూకీ తెలియరాలేదు. ఏలూరు జిల్లా పెదవేగి మండలం దుగ్గిరాలకు చెందిన 12 మంది యువకులు శుక్రవారం బాపట్ల జిల్లా వేటపాలెం మండలం రామాపురం బీచ్‌కు వెళ్లారు. వీరంతా కేరింతలు కొడుతూ సముద్ర స్నానానికి పరుగులు తీశారు. సముద్రంలో స్నానాలు చేస్తుండగా నలుగురు యువకులు గల్లంతయ్యారు. తోటి యువకులు వీరి కోసం వెతికినా జాడ తెలియలేదు. దీంతో స్థానికుల సహాయంతో పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే రెస్క్యూ సిబ్బంది సముద్రంలో ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. కొద్ది సేపటికి దుగ్గిరాలకు చెందిన గొటికల తేజ (21), జాలా కిషోర్ (28)ల మృతదేహాలు ఒడ్డుకు కొట్టుకువచ్చాయి. కోరు అమ్మన్నరాజు, చట్టిమాల నితిన్‌ల ఆచూకీ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

మేరీమాత దర్శనం చేసుకుని..

దుగ్గిరాలకు చెందిన డేవిడ్, నిర్మల కుమారుడు గొటికల తేజ చదువుకుంటూ ఖాళీ సమయంలో కూలీ పనులు చేస్తుంటాడు. ఉదయం ఇంటి నుంచి విజయవాడలోని గుణదల మేరీ మాత దర్శనం చేసుకుని అటు నుంచి రామాపురం బీచ్‌కు వెళ్లాడని, తమ కుమారుడు సముద్రంలో మునిగి చనిపోయినట్లు సాయంత్రం ఫోన్ వచ్చిందని కుటుంబ సభ్యులు బోరుమంటున్నారు.

సాయంత్రం వచ్చేస్తానని..

గ్రామంలోని బోయిజ్, స్వరాజ్యలక్ష్మి చిన్న కుమారుడు జాల కిషోర్. ఉదయం స్నేహితులతో కలిసి ఇంటి నుంచి బయటకు వెళ్లాడని, సాయంత్రం వచ్చేస్తానని చెప్పి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడని కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు. కిషోర్ కూలీ పనులు చేస్తుంటాడు.

కూలీ పనులు చేస్తూ జీవనం

గ్రామానికి చెందిన కోరు అమ్మన్నరాజు.. తండ్రి బాలస్వామి మృతి చెందగా తల్లి పావని సంరక్షణలో చదువుకుంటూ ఖాళీ సమయంలో కూలీ పనులు చేస్తుంటాడు. గుణదల మేరీ మాత దర్శనానికి వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరాడని సాయంత్రం ఎవరో ఫోన్ చేసి రామాపురం బీచ్‌లో అమ్మన్న రాజు గల్లంతయ్యాడని చెప్పారని తల్లి పావని రోదిస్తోంది.

హుటాహుటిన రామాపురానికి..

గ్రామానికి చెందిన ఆశీర్వాదం, జయమేరీల చిన్న కుమారుడు చట్టిమాల నితిన్. సరదాగా స్నేహితులతో కలిసి బయటకు వెళ్లి వస్తానని సంతోషంగా ఇంటి నుంచి బయలుదేరాడని, సాయంత్రం ఎవరో ఫోన్ చేసి నితిన్ సముద్రంలో గల్లంతయ్యాడని చెప్పడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన రామాపురం బయలుదేరి వెళ్లారు.

రమణీయం వేణుగోపాలుడి రథోత్సవం



రథంపై పూజలు చేస్తున్న అర్చకులు



రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి రథోత్సవం



రథోత్సవంలో ఉత్సవమూర్తులు

యద్దనపూడి: మండలంలోని పూనూరు గ్రామంలో వేంచేసి ఉన్న రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి రథోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకొని బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణం నిర్వహించిన అనంతరం రథోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా అర్చకులు దీవి భావానాచార్యులు వేద పండితుల ఆధ్వర్యంలో వేణుగోపాల స్వామికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవ మూర్తులను ప్రత్యేక పల్లకిలో రథం వద్దకు తోడ్కొని వచ్చారు. ఈ సందర్భంగా యాగశాలలో రథాంగ హోమం, రథాంగ బలి, దృష్టి కుంభం, మంచి రాచగుమ్మడి కాయలతో రథానికి దిష్టి తీసి, కొబ్బరి కాయలతో సాత్విక బలి సమర్పించారు. అనంతరం స్వామి వార్లను రథంపై అదిష్టింపజేశారు. ఉత్సవమూర్తులను చూసేందుకు భక్తులు రహదారులకు ఇరువైపులా బారులు తీరారు. యాత్ర ఆలయం నుంచి రెండు కిలోమీటర్ల మేర సాగి, తిరిగి ఆలయానికి చేరుకోవటంతో రథోత్సవ ఘట్టం ముగిసింది. భక్తులు రథాన్ని లాగుతూ.. గోవింద నామస్మరణతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్సై జీవీ చౌదరి తన సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ శైలేంద్ర, ఈఓ నాగయ్య భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు.

ఫల ప్రసాదం..వృక్ష ఆధారిత వ్యవసాయం

జిల్లా అటవీ శాఖాధికారి భీమయ్య



మొక్క నాటి, నీరుపోస్తున్న జిల్లా అటవీ శాఖాధికారి భీమయ్య

చీరాల టౌన్: ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం కీర్తివారిపాలెం నగర వనంలో ఉన్న నక్షత్ర వనంలో అటవీ శాఖ అధికారులు మొక్కలు నాటారు. ఇందుకు ట్రీ ఫౌండేషన్ జిల్లా సమన్వయ కర్త శవనం రామచంద్రారెడ్డి మామిడి, అత్తి, జువ్వి, మర్రి, రావి మొక్కలను అందించారు. జిల్లా అటవీ శాఖాధికారి ఎల్.భీమయ్య మొక్కలు నాటి, నీరు పోశారు. అలానే సిటీ ఫారెస్ట్‌లో ఏర్పాటు చేసిన నక్షత్ర వనం, శివ పంచవనం, గ్రహ వనం, పంచవటి, అష్టదిక్పాలకుల వనం, సప్త రుషుల వనంలో మొక్కల సంరక్షణ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా అటవీశాఖాధికారి మాట్లాడుతూ.. అన్నదాతలు వృక్షాలను ఆధారం చేసుకుని వ్యవసాయం చేస్తే.. మంచి ఫలప్రసాదం లభిస్తుందన్నారు. అడవుల రక్షణలో భాగంగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని కోరారు. ట్రీ ఫౌండేషన్ అందిస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ రాగమ్మ, అటవీ శాఖ సిబ్బంది ఉన్నారు.

క్లుప్తంగా

రైలు నుంచి పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి



తెనాలిరూరల్: రైలు నుండి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. తెనాలి జీఆర్పీ పోలీసుల అందించిన వివరాలు.. బాపట్ల జిల్లా చుండూరు రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాల వెంబడి మృతదేహం ఉందన్న సమాచారం మేరకు ఘటనా స్థలాన్ని శుక్రవారం పరిశీలించారు. సుమారు 40 ఏళ్ల వయసున్న వ్యక్తి మృతి చెంది పడి ఉండడాన్ని గుర్తించారు. రైలులో నుండి ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతుడి జేబులో గురువారం రాత్రి 11 గంటలకు విజయవాడ నుంచి తిరుపతికి తీసుకున్న టికెట్ ఉంది. మృతదేహాన్ని తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతి

బండారుపల్లి(తాడికొండ): రైల్వేట్రాక్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు నడికుడి జీఆర్పీ ఎస్ఐ వి.శ్రీనివాసరావు నాయక్ శుక్రవారం తెలిపారు. ఉదయం సుమారు 36 సంవత్సరాల వయస్సున్న వ్యక్తి శవాన్ని గుర్తించి సత్తెనపల్లి జీజీహెచ్‌కు తరలించినట్లు తెలిపారు. మృతుడి కుడిచేతి మీద బి.కుమారి అని పచ్చబొట్టు తెలుగులో ఉందని, ఎత్తు సుమారు నాలుగున్నర, నలుపు రంగు, తెల్లటి దుస్తులు ధరించి ఉన్నాడు. తలపై దెబ్బ తగలడంతో మరణించినట్లు గుర్తించి సత్తెనపల్లి ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు నడికుడి జీఆర్పీ ఎస్ఐ శ్రీనివాసరావు నాయక్ ఫోన్ నంబర్ 8074174484ను సంప్రదించాలని సూచించారు.

పట్టపగలు చోరీకి యత్నం

దుండగుడిని పట్టుకుని దేహశుద్ధి చేసిన గ్రామస్తులు



తెనాలిరూరల్: పట్టపగలు ఇంట్లో చోరీకి యత్నించిన వ్యక్తిని పట్టుకున్న గ్రామస్తులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. బాపట్ల జిల్లా చుండూరు మండలం వలివేరు గ్రామంలో ఘటన చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామంలోని ఓ ఇంట్లోని మహిళ పక్కనే ఉన్న తన అత్తింటికి ఉదయం 10 గంటల ప్రాంతంలో వెళ్లింది. వెంటనే ఐదు నిమిషాల్లో ఇంటికి తిరిగి రాగా ఇంట్లోకి దుండగుడు చొరబడి బీరువాను తెరిచేందుకు ప్రయత్నిస్తుండడాన్ని గమనించింది. ఇంటికి ఉన్న రెండు గుమ్మాలను బయట నుంచి చాకచక్యంగా గొళ్లెం పెట్టేసి సమాచారాన్ని బంధువులకు గ్రామస్తులకు తెలిపింది. గ్రామస్తులు ఇంటికి చేరుకుని దుండగుడిని పట్టుకుని తాళ్లతో బంధించి దేహశుద్ధి చేశారు. అతని జేబులో ఉన్న డ్రైవింగ్‌లైసెన్సు ఆధారంగా బాపట్ల సమీపంలోని అరవపల్లికి చెందిన షేక్ కరిముల్లాగా గుర్తించి పోలీసులకు అప్పగించారు. దుండగుడిపై బాపట్లలో 15కు పైగా చోరీ కేసులు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతానికి చుండూరు పోలీసుల అదుపులో ఉన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం





కలెక్టరేట్‌లో యోగాసనాలు వేస్తున్న అధికారులు, విద్యార్థులు

జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు

బాపట్ల టౌన్: యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు పేర్కొన్నారు. శుక్రవారం 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు పలు యోగాసాలు వేశారు. అనంతరం డీఆర్వో సత్తిబాబు మాట్లాడుతూ మానసిక ఒత్తిడి నుంచి బయటపడటానికి యోగానే సులువైన మార్గమన్నారు. శరీర సౌష్టవంతో పాటు దేహ దారుఢ్యం మెరుగుపడుతుందని తెలిపారు. మంచి ఆరోగ్యం, ప్రశాంతత కోసం యోగాని అనుసరించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అధికారికంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. యోగాతో రోగాలు నయమవుతాయని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ తెలిపారు. ప్రతి రోజు 45 నిమిషాలు యోగా చేస్తే ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు మానసిక ఒత్తిడి నుంచి విముక్తి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా రవాణ శాఖాధికారి ఆర్.సురేష్, అటవీ శాఖ అధికారి ఎల్.బీమయ్య, డీఐపీఆర్‌ఓ సహాయ సంచాలకురాలు కె.సుభాషిణి, సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి రాజదిబోరా, ఉద్యాన శాఖ ఏడీ జెన్నమ్మ, ఆయుష్ శాఖ వైద్యాధికారి డాక్టర్ బాల ప్రభావతి, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి పెమ్మసానికి వర్సిటీ వద్ద ఘన స్వాగతం



అభివాదం చేస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

ఏఎన్‌యూ: కేంద్ర గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టి తొలిసారి గుంటూరుకు వచ్చిన డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌కు వర్సిటీ వద్ద ఘన స్వాగతం లభించింది. గన్నవరం నుంచి గుంటూరు వస్తున్న ఆయనను వర్సిటీ ముఖ ద్వారం వద్ద తెలుగు నాడు స్టూడెంట్ ఫెడరేషన్, తెలుగు నాడు ట్రేడ్ యూనియన్ నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి బొకేలతో, శాలువాలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో వర్సిటీ అధ్యాపకులు ఆచార్య వి.వెంకటేశ్వర్లు, ఆచార్య సుబ్బారావు, ఆచార్య వి.రవికుమార్, ఆచార్య సింహాచలం, ఆచార్య రామచంద్రన్, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు హేమంత్, భవ్య, గోపి, హరీష్, రామన్, టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు వి.విష్ణు ప్రసాద్, నాయకులు డాక్టర్ ఎం.వెంకటరమణ తదితరులు కేంద్ర మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

గుంటూరులో..

గుంటూరు వెస్ట్: గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రిగా ఇటీవల ప్రమాణ స్వీకారం చేసిన గుంటూరు ఎంపీ డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌కు జిల్లాలో అపూర్వ స్వాగతం లభించింది. జాతీయ రహదారి వైజంక్షన్ నుంచి భారీ స్థాయిలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు స్వాగతం పలికారు. అనంతరం స్థానిక ఇన్నర్‌రింగ్‌రోడ్డులో శ్రీకన్వెన్షన్‌లో పెమ్మసాని అభిమానులు, కార్యకర్తలు, నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తన విజయానికి చిత్తశుద్ధితో కృషి చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. తనకు ఎంపీగా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, ఐటీ శాఖ మంత్రి లోకేష్‌కు, సీనియర్ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గళ్లా మాధవి, మొహమ్మద్ నసీర్ అహ్మద్, బూర్ల రామాంజనేయులు, తెనాలి శ్రావణ్‌కుమార్, ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌తో పాటు, టీడీపీ నాయకులు ఉగ్గిరాల సీతారామయ్య, సయ్యద్ ముజీబ్, భీమనాథం భరత్‌రెడ్డి, మద్దిరాల మ్యాని, కె.రజిని, వనమా నరేంద్ర పాల్గొన్నారు.

నీట్ అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పి.మనోజ్‌కుమార్



పాత బస్టాండ్‌లో నిరసన ర్యాలీ చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

బాపట్లటౌన్: నీట్ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పి.మనోజ్‌కుమార్ డిమాండ్ చేశారు. నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలకు నిరసనగా శుక్రవారం విద్యార్థి సంఘాలతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మనోజ్‌కుమార్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నీట్ యూజీ 2024 ఫలితాల్లో జరిగిన అవకతవల వల్ల మెడికల్ ఎంట్రెన్స్ రాసిన విద్యార్థులు ఆందోళన చేస్తున్నారన్నారు. హరియాణకు చెందిన ఒకే పరీక్ష కేంద్రంలో ఏడుగురు విద్యార్థులకు ఆలిండియా ఫస్ట్ ర్యాంక్ రావడం, వారందరికీ 720/720 మార్కులు రావడంతో ఎన్నో అనుమానాలకు తావిస్తోందన్నారు. నీట్ పరీక్షలో విద్యార్థులకు సాధ్యం కాని విధంగా 718, 719 మార్కులు వచ్చాయన్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) జూన్ 14న ఫలితాలు విడుదల చేస్తామని ప్రకటించి, ఎన్నికల కౌంటింగ్ రోజున జూన్ 4న పరీక్ష ఫలితాలు విడుదల చేయటంతో ఎన్నో సందేహాలు తలెత్తాయన్నారు. నీట్‌లో అవకతవకులు జరిగాయని నిర్ధారణ జరిగిందని, ఇందుకు కారకులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని విమర్శించారు. మెడికల్ ప్రవేశ పరీక్షలు భవిష్యత్తులో రాష్ట్ర స్థాయిలో నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ బాపట్ల పట్టణ అధ్యక్షులు భాను, నాయకులు మణికంఠ, శివమణి, ఆదిత్య, యస్వంత్ విద్యార్థులు పాల్గొన్నారు.

యువతి హత్య కేసులో దోషులను కఠినంగా శిక్షించాలి

- బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలి
- వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు జోగి రాజా



బాపట్లటౌన్: యువతి హత్యకు కారకులైన కసాయి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు జోగి రాజా డిమాండ్ చేశారు. చీరాల మండలం ఈపూరుపాలెంలో సుచరిత అనే యువతిపై గుర్తుతెలియని వ్యక్తులు అత్యాచారం అపై హత్యచేయడం అమానుషమన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో ఏర్పాటు చేసిన దిశ పోలీస్ స్టేషన్ పేరు మార్చడంపై పెట్టే దృష్టి, చట్టాన్ని కఠినంగా అమలు చేసే అంశాలపై పెడితే బాగుంటుందని ప్రభుత్వానికి హితవు పలికారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి, పార్లమెంటులో చట్టం చేసే విధంగా చూడాలన్నారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రభుత్వం తరఫున అన్ని రకాల సహాయ సహకారాలు అందించాలని కోరారు.

లైంగిక దాడి నిందితులను కఠినంగా శిక్షించాలి

తాడేపల్లిరూరల్: బాపట్ల జిల్లా ఈపురుపాలెంలో యువతిపై లైంగిక దాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఐద్వా రాష్ట్ర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు బి.ప్రభావతి, డి.రమాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తెల్లవారుజామున బహిర్భూమికి వెళ్లిన యువతిని దారుణంగా చంపివేశారని, కుటుంబ సభ్యులు వెతకగా ఆమె మృతదేహం కనిపించడం విచారకమని, తక్షణమే నిందితులను పట్టుకుని త్వరితగిన విచారణ చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. మహిళలకు రక్షణ కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని, ఆడబిడ్డలకు ప్రభుత్వం భరోసా ఇవ్వాలని, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని వారు ఆ ప్రకటనలో కోరారు.

నిమ్మకాయల ధరలు



తెనాలి: స్థానిక మార్కెట్‌యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.4,000, గరిష్ట ధర రూ.5,700, మోడల్ ధర రూ.4800 వరకు పలికింది.

సింథైట్ ఫ్యాక్టరీ కార్మికుల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న కార్మికులు

మేదరమెట్ల: సింథైట్ ఫ్యాక్టరీని మూసివేస్తే ఉద్యమిస్తామని కార్మికులు హెచ్చరించారు. సమీప గ్రామల ప్రజల నుంచి మిరప కోరుతో కళ్లు మంటలు వస్తున్నాయని, ఫ్యాక్టరీని మూసివేయాలనే డిమాండ్ పెరిగింది. దీంతో యాజమాన్యం ఫ్యాక్టరీని మూసివేసే అవకాశం ఉందని తెలుసుకున్న కార్మికులు శుక్రవారం జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని కార్మికులకు సర్ది చెప్పడంతో వారు రాస్తారోకోను విరమించారు. కొరిశపాడు మండలం మేదరమెట్లలోని తమ్మవరం రోడ్డులో మిరపకాయల నుంచి సింథైట్‌ను తయారు చేసే ఫ్యాక్టరీ ఉంది. ఈ ఫ్యాక్టరీని ఏర్పాటు చేసిన దగ్గర నుంచి సమీప గ్రామాల ప్రజలు తరచూ మిరప కోరుతో కళ్లు మండుతున్నాయని, కళ్లు పోయే ప్రమాదం ఉన్నందున ఫ్యాక్టరీని మూసేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు మూడు రోజుల క్రితం గ్రామస్తులు, సమీప గ్రామాలకు చెందిన వారు కొందరు ధర్నా చేశారు. ఈ క్రమంలో ఫ్యాక్టరీని ఎత్తేస్తే తాము ఉపాధిని కోల్పోతామని అక్కడ పనిచేస్తున్న కార్మికులు ఆందోళనకు దిగారు.

శ్రీరామకథ మృత సంజీవని



హాజరైన మహిళలు

ప్రవచనకర్త వాచస్పతి 'బ్రహ్మశ్రీ' చాగంటి కోటేశ్వరరావు



తెనాలి: శ్రీరామకథ మృతసంజీవని... అంత మధురమైనది మరొకటి ఉండదు... రామకథను చదవినా, విన్నా ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ప్రవచనకర్త వాచస్పతి బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. పట్టణానికి చెందిన శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తనా బృందం, సంకీర్తనా సేవాసమితి సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఇక్కడి వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో ఏర్పాటైన ప్రత్యేక సభలో 'శ్రీరామనాము-శ్రీహనుమాన్ చాలీసా పారాయణ విశిష్టత' అనే అంశంపై ఏర్పాటు చేసిన 'ప్రవచనామృతం' కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. దాదాపు ఐదు వేలమందికి పైగా హాజరయ్యారు. సభలో బ్రహ్మశ్రీ కోటేశ్వరరావు చేసిన ప్రసంగం ఆకట్టుకుంది. పాపం మనయందు ఉన్నపుడు, భగదనుగ్రహం లేపుడు ఎలాంటి రక్షణ ఉండదని, మనంతట మనం ఎన్ని ఏర్పాట్లు చేసుకున్నా రక్షణ ఇవ్వలేవని చెప్పారు. రామనామం స్మరిస్తుంటే రామకథను చదివేలా చేస్తుందనీ, రామకథ పాతకాల నుంచి రక్షిస్తుందని అన్నారు. ఈశ్వరుడు ఏమి చేయవద్దని నిర్దేశించాడో వాటిని చేయటమే పాపమని చెబుతూ, కొన్ని ప్రాయశ్చిత్త కర్మలు ఉన్నటికీ పంచ మహాపాతకాలను పోగొట్టే శక్తి భగవంతుని నామ స్మరణకు ఉందన్నారు. 'ఈశ్వరా..స్వర పేటికను ఇచ్చిన మీరే నా చేత భగవంతుడి నామసంకీర్తన చేసే భాగ్యం కల్పించు' అని కోరుకోవాలని సూచించారు. నిర్గుణుడైన భగవంతుడు ఒక్కోసారి ఒక్కో గుణాన్ని ఆవిష్కరించినపుడు సంబంధిత నామం వస్తుందన్నారు. ఏ నామంతో పిలిచినా భగవంతుడు కదిలివస్తాడని చెబుతూ ప్రహ్లాద చరిత, గజేంద్ర మోక్షం అంశాలను గుర్తుచేశారు. అన్నింటిలోకెల్లా రామనామ వైభవం మరింత విశేషమైందని కోటేశ్వరరావు చెప్పారు. రామాయణకాలం నాటికి పరమ గురువైన శ్రీమహావిష్ణువు, శిష్యుడైన వశిష్ఠుడు దగ్గర శిష్యుడిగా ఉన్నాడని, ఇక్ష్వాకుల వంశానికి మేలుచేస్తూ మనందరికీ శ్రీరామనామం ఇచ్చి మహోపకారం చేశారని వివరించారు. తెలిసిగానీ, తెలియకగానీ రామనమం స్మరిస్తుంటే పాపాన్ని దహించి వేస్తుందన్నారు. రామనామ లేఖనం మహా తపస్సుగా చెప్పారు. శ్రీరామ అని ఎన్ని సార్లు రాస్తే అన్నిసార్లు ఆ నామాన్ని స్మరిస్తామని, విష్ణుసహస్ర నామం ఫలితం లభిస్తుందని వివరించారు. తొలుత శ్రీపంచముఖ ఆంజనేయస్వామికి విశేష అర్చనలు, అనంతరం శ్రీహనుమాన్ చాలీసా పారాయణ చేశారు.

ఆంధ్రప్రదేశ్ కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ (APCZMA)

ఆంధ్రప్రదేశ్ పర్యావరణ అడవులు & వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం, పర్యావరణ భవన్,
ఎ.పి.ఐ.ఐ.సి. కాలని రోడ్, గురునానక్ కాలనీ, ఆటోనగర్, విజయవాడ-520007

ప్రజాభిప్రాయ సేకరణ ప్రకటన (ప్రకాశం జిల్లా సిజెడ్ఎంపిల యొక్క ఖరారు కొరకు)

కోస్టల్ రెగ్యులేషన్ జోన్ నోటిఫికేషన్ జి.ఎస్.ఆర్.37(ఇ), తేది:18.01.2019కి అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ తీరం పూర్తి విస్తర్ణ కొరకు కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ ప్లానును భారత ప్రభుత్వంచే ఆమోదించబడిన నేషనల్ సెంటర్ ఫర్ సస్టయినబుల్ కోస్టల్ మేనేజ్‌మెంట్ (NCSCM) చెన్నై వారు తయారుచేయబడ్డినది. ప్రాజెక్ట్ యొక్క సారాంశము మరియు జిల్లాకు సంబంధించిన ప్రజాభిప్రాయ సేకరణ యొక్క వివరములు దిగువ తెలుపబడినవి.

ప్రాజెక్టును ప్రతిపాదించిన వారు	ది మెంబర్ సెక్రటరీ, ఆంధ్రప్రదేశ్ కోస్టల్‌జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ (APCZMA), పర్యావరణ అడవులు & వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వ పర్యావరణ భవన్, ఏపిఐఐసి కాలనీ రోడ్డు, గురునానక్ కాలనీ, ఆటోనగర్, విజయవాడ-520007
కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ ప్లాన్‌కు సంబంధించిన వివరాలు పొందుపరచిన స్థానిక సంస్థలు మరియు కార్యాలయాలు	**ప్రకాశం జిల్లా** **సింగరాయకొండ మండలం:** పింగిళి పల్లి, పాకాల, చాపంపూడి & సింగరాయకొండ (పాత) యు గ్రామాలు **కొత్తపట్నం మండలం:** అల్లూర్, ఈత ముక్కల, మడునూర్, రాజుపాలెం & పాదర్తి గ్రామాలు **టంగుటూరు మండలం:** ఆనంతవరం, టంగుటూరు, వెలగపూడి గ్రామాలు **జరుగుమిల్లి మండలం:** కె.బిట్రగుంట గ్రామం **నాగులుప్పలపాడు మండలం:** అమ్మనబ్రోలు & కనుపర్తి గ్రామాలు **ఒంగోలు మండలం:** చేజర్ల, దేవరంపాడు & ఉలిచి గ్రామాలు **శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా** **ఉలవపాడు మండలం:** బిట్రగుంటపల్లి, చాకిచెర్ల & కరేడు గ్రామాలు **బాపట్ల జిల్లా** **చినగంజాం మండలం:** చినగంజాం, మోటుపల్లి, పెదగంజాం & పెదగంజాం(ప) గ్రామాలు
ప్రాజెక్టు పని వివరములు	ప్రకాశం జిల్లా యొక్క కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ ప్లాను (CZMP) గురించి
ప్రజాభిప్రాయ సేకరణ తేది, సమయం & స్థలం	30.07.2024 ఉ.11.00 గంటలకు బృందావన్ రిసార్ట్స్ దగ్గర, కొత్తపట్నం బీచ్, ప్రకాశం జిల్లా.

సిఆర్‌జెడ్ నోటిఫికేషన్, 2019 లోని అనుబంధం 4, పేరా 6 ప్రకారం సిజెడ్ఎంపి ఖరారు నిమిత్తం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించబడుతుంది. సదరు ప్రకాశం జిల్లా యొక్క సిజెడ్ఎంపి ముసాయిదా ప్రచారం కొరకు ఆంధ్రప్రదేశ్ కోస్టల్ మేనేజ్‌మెంట్ అథారిటీ వారి వెబ్‌సైట్ అనగా http://apczma.ap.gov.in/UI/home.aspx నందు ప్రచురించబడినది. సదరు సిజెడ్ఎంపి యొక్క ముసాయిదా మరియు ఎగ్జిక్యూటివ్ సమ్మరీ (తెలుగు మరియు ఆంగ్ల భాషలలో) దిగువ కార్యాలయాలలో పొందుపరచబడినది.

1) ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఇఎఫ్ఎస్ & టి శాఖ, సెక్రటేరియట్, మంగళగిరి
2) మెంబర్ సెక్రటరి వారి కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, పర్యావరణ భవన్, జాయక్ అపార్ట్‌మెంట్స్ ఎదురుగా, ఏపిఐఐసి కాలనీ రోడ్, గురునానక్ కాలనీ, విజయవాడ
3) మెంబర్ సెక్రటరి వారి కార్యాలయం, ఏపిసిజెడ్ఎంఏ, గురునానక్ కాలనీ, విజయవాడ.
4) జాయింట్ డైరెక్టర్(లు) వారి కార్యాలయం, పర్యావరణ, అడవులు & వాతావరణమార్పుల మంత్రిత్వ శాఖ, ఇంటిగ్రేటెడ్ రీజనల్ కార్యాలయం, గ్రీన్ హౌస్ కాంప్లెక్స్, గోపాలరెడ్డి రోడ్డు, విజయవాడ.
5) జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ వారి కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, జోనల్ కార్యాలయం, విజయవాడ.
6) కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ వారి కార్యాలయం, ప్రకాశం జిల్లా.
7) చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వారి కార్యాలయం, జిల్లా పరిషత్, ప్రకాశం జిల్లా.
8) జిల్లా పంచాయితీ ఆఫీసర్ వారి కార్యాలయం, ప్రకాశం జిల్లా.
9) జనరల్ మేనేజర్ వారి కార్యాలయం, జిల్లా ఇండస్ట్రీస్ సెంటర్, ప్రకాశం జిల్లా.
10) డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్, ప్రకాశం జిల్లా.
11) రెవిన్యూ డివిజనల్ అధికారి, ఒంగోలు రెవిన్యూ డివిజన్, ప్రకాశం జిల్లా.
12) ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, ఒంగోలు జిల్లా.
13) జిల్లా మత్స్యశాఖ అధికారి, మత్స్యశాఖ, ఒంగోలు జిల్లా.
14) ప్రాంతీయ కార్యాలయం-ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ఒంగోలు.
15) కమీషనర్, ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ ప్రకాశం జిల్లా.
16) తహశీల్దారు సింగరాయకొండ, కొత్తపట్నం, టంగుటూరు, జరుగుమిల్లి, నాగులుప్పలపాడు & ఒంగోలు మండలాలు, ప్రకాశం జిల్లా.
17) తహశీల్దారు ఉలవపాడు మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు, నెల్లూరు జిల్లా.
18) తహశీల్దారు చినగంజాం మండలం, బాపట్ల జిల్లా.
19) ఎంపిడిఓ, సింగరాయకొండ, కొత్తపట్నం, టంగుటూరు, జరుగుమిల్లి, నాగులుప్పలపాడు & ఒంగోలు మండలాలు, ప్రకాశం జిల్లా.
20) ఎంపిడిఓ, ఉలవపాడు మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.
21) ఎంపిడిఓ, చినగంజాం మండలం, బాపట్ల జిల్లా.
22) పైన తెలిపిన అన్ని గ్రామ సచివాలయాలు

ప్రభావిత ప్రాంతాలలోని సంస్థలు / శాఖలు / స్థానిక కమ్యూనిటీలు / ప్రజలు / ఎన్‌జిఓలు తదితరులు సిజెడ్ఎంపి ముసాయిదా పై తమ అభిప్రాయాలు, సూచనలు, అభ్యంతరాలు ఏవైనా ఉన్నట్లయితే ఈ ప్రకటన ప్రచురించిన 30 రోజులలోగా తెలుగు లేదా ఆంగ్ల భాషలలో మెంబర్ సెక్రటరీ, ఆంధ్రప్రదేశ్ కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ (APCZMA), ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయం, పర్యావరణ భవన్, ఏపిఐఐసి కాలని రోడ్డు, గురునానక్ కాలనీ, ఆటోనగర్, విజయవాడ-520007 వారికి వ్రాతపూర్వకంగా పోస్టు ద్వారా లేదా apczma2016@gmail.com ఈ మెయిల్ ద్వారా లేదా ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి యొక్క దిగువ సంతకందారుకు వేరు విధంగా పోస్టు ద్వారా లేదా ఈ మెయిల్ roogl-ee1@appcb.gov.in ద్వారా పంపవచ్చును మరియు / లేదా పైన తెలిపిన తేదీన, ప్రదేశమున బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొని తమ అభిప్రాయాలు, సూచనలు, అభ్యంతరాలు తెలుపవచ్చును.

ప్రదేశం: ఒంగోలు
తేది:21-06-2024

సం/- ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయం, ఒంగోలు
మెంబర్‌సెక్రటరీ, ఆంధ్రప్రదేశ్ కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ, విజయవాడ-520007 వారి తరఫున